TGTEL/26/A7716

ఉద్యమ పోరు

UDYAMA PORU

ప్రతి పదం.. పోరాట కదం..

వరంగల్ | సంపుటి : 1 | సంచిక : 31 | సోమవారం | 19.10.2026 | పేజీలు : 8 | వెల : 3 /- | ఎడిటర్ - బండారి సుమంత్

రాహుల్ రాజకీయాలు దేశంలో అస్థిరత సృష్టిస్తున్నాయి - ముస్లిం రాష్ట్రీయ మంచ్

- ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల గెలుపు సర్టిఫికెట్‌పై వివాదం
- ధ్రువపత్రం జారీలో కార్మిక శాఖ జాప్యం చేస్తోందని జేఏసీ విమర్శ
- ఎన్నికల మొదట్నుంచి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపణ
- వెంటనే జోక్యం చేసుకోవాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి విజ్ఞప్తి

2

దుర్గా పూజ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి.. నారీశక్తిపై కీలక వ్యాఖ్యలు

- మహిళలను గౌరవించడమే అమ్మ వారికి నిజమైన పూజ అని వ్యాఖ్య
- చెడుపై మంచి సాధించిన విజయానికి ఈ పండుగ ప్రతీక
- భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దుర్గా పూజ అద్దం పడుతుందని వెల్లడి
- వ్యక్తిగత, సామాజిక జీవితంలో మహిళలకు గౌరవం ఇవ్వాలని పిలుపు

2

ఆప్ సర్కార్‌పై అమిత్ షా ధ్వజం.. మృతుల కుటుంబాలతో భేటీకి నిర్ణయం

- పంజాబ్ ఆప్ ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు
- రాష్ట్రాన్ని డ్రగ్స్ ఊబిలోకి నెట్టేశారని ఆరోపణ
- డ్రగ్స్ మాఫియా చేతిలో చనిపోయిన వారి కుటుంబాలను కలవనున్న షా
- మంగళవారం మాన్సా, సంగ్రూర్, గురుదాస్‌పూర్‌లో పర్యటన

2

ఢిల్లీ వీధుల్లో కొత్త పోరు..

- సీజేపీకి పోటీగా ఢిల్లీలో 'లాల్ హిట్ జనతా పార్టీ'

- సీజేపీ నిరసనలకు వ్యతిరేకంగా ఢిల్లీలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు
- 'లాల్ హిట్ జనతా పార్టీ' పేరుతో ఆవిర్భవించిన నూతన గ్రూప్
- రాజ్యాంగ సంస్థలను అగౌరవపర్చడాన్ని సహించబోమని స్పష్టీకరణ
- పండుగల వేళ వ్యాపార నష్టాలకు కారణమవుతున్నారని సీజేపీపై ఆరోపణ

2

పుష్కరాల శోభ..

- గోదావరి తీరానికి రూ.2,000 కోట్లు

- పుష్కరాల శోభ: గోదావరి తీరానికి రూ.2,000 కోట్లు
- ప్రముఖ క్షేత్రాలకు భారీ నిధులు: భద్రాచలం, బాసరకు మహర్దశ
- ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం: రూ.44 కోట్లతో నాచారం 4-లేన్ రోడ్డు
- ఆలయాల బాటలో అభివృద్ధి: మహిళా సాధికారత, మౌలిక వసతుల విస్తరణ

ఉద్యమపోరు, కోల్‌కతా : తెలంగాణా రాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ పడుతోంది. దసరా పండుగ వేళ రాష్ట్రంలోని ఆలయాలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.2,500 కోట్లు కేటాయించి పనులు చేపడుతున్నట్లు తెలంగాణా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నాచారం శ్రీ అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. ఏన్కూరు నుంచి నాచారం కొండ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి రూ.44 కోట్లతో శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పూర్తయితే భక్తులు సులభంగా ఆలయానికి చేరుకోవచ్చని, స్థానిక వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి రూ.354 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు జరుపుతున్నట్లు తెలిపారు. ఆర్థికమంత్రిగా తానే ఈ నిధులు కేటాయించడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని చెప్పుకున్నారు. గోదావరి పుష్కరాలకు సన్నాహకంగా నదీ తీర ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి సుమారు రూ.2,000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యతగా స్పష్టం చేశారు.....

2

డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీ మోసం

- రూ. 29 లక్షలు కాజేసిన ముఠాలో ఇద్దరి అరెస్ట్

- డిజిటల్ అరెస్ట్ పేరుతో రిటైర్డ్ ఉద్యోగికి మోసం
- సీబీఐ, ఈడీ అధికారులమంటూ బెదిరింపులు
- విడతలవారీగా రూ. 29 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
- మోసానికి పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

2

సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

- పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి బండ్ల గణేశ్ విజ్ఞప్తి
- అక్రమ నిల్వలతో దాణా ధరలు విపరీతంగా పెంచుతున్నారని ఆరోపణ
- మొక్కజొన్న, సోయాబీన్ వంటి ముడి సరుకులను గోదాముల్లో దాస్తున్నారని ఆవేదన

2

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనం.. తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

- హైదరాబాద్‌లో మందగించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు
- గతేడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో 15 % తగ్గుదల
- పడిపోయిన బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల అమ్మకాలు
- కోటి రూపాయల పైబడిన ఇళ్లకే కొనసాగుతున్న ఆదరణ
- మొత్తం లావాదేవీల విలువను నిలబెడుతున్న ప్రీమియం సెగ్మెంట్

ఉద్యమపోరు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు సెప్టెంబర్ నెలలో కాస్త బ్రేకులు పడ్డాయి. గృహాలకు సంబంధించిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల సంఖ్యలో గత ఏడాదితో పోలిస్తే గణనీయమైన తగ్గుదల నమోదైంది. అయితే, కోటి రూపాయలకు పైబడిన ప్రీమియం ఇళ్ల సెగ్మెంట్ మాత్రం స్థిరమైన డిమాండ్‌తో మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ఇప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ల శాఖ డేటాను విశ్లేషించి ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం, 2026 సెప్టెంబర్‌లో హైదరాబాద్ (హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు కలిపి) పరిధిలో 5,620 నివాస గృహాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది ఇదే నెలలో నమోదైన 6,612 రిజిస్ట్రేషన్లతో పోలిస్తే ఇది 15 శాతం తక్కువ. అదేవిధంగా, లావాదేవీల విలువ కూడా 7 శాతం తగ్గి, రూ.4,804 కోట్ల...

2

పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- పండగ స్పెషల్ బస్సుల ఛార్జీల పెంపుపై హరీశ్ రావు విమర్శలు
- సాధారణ బస్సులనే స్పెషల్స్‌గా నడుపుతూ అధిక ఛార్జీలు వసూలు
- స్పెషల్ బస్సులపై 50 శాతం సర్ఛార్జి మాత్రమేనంటున్న టీజీఎస్ఆర్టీసీ

2



రాహుల్ రాజకీయాలు దేశంలో అస్థిరత సృష్టిస్తున్నాయి : ముస్లిం రాష్ట్రీయ మంచ్

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్షాలు, సీజేపీ అనుసరిస్తున్న రాజకీయ విధానాలు దేశాన్ని బలహీనపరిచేలా ఉన్నాయని ముస్లిం రాష్ట్రీయ మంచ్ (ఎంఆర్ఎం) తీవ్రంగా విమర్శించింది. దేశ ఐక్యతను, రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీసే ఏ ప్రయత్నాన్ని కూడా అంగీకరించేది లేదని స్పష్టం చేసింది. ఆదివారం లక్నోలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా ఎంఆర్ఎం మార్గదర్శి, ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇంద్రేశ్ కుమార్ మాట్లాడుతూ.. కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రతిపక్షాలు, సీజేపీ దేశంలో అస్థిరతను, అపనమ్మకాన్ని సృష్టిస్తున్నాయని ఆరోపించారు. అధికారం కోసం దేశ సుస్థిరతను, జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టడం సరైనదేనా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అపనమ్మకం కలిగించే బదులు, ప్రజాస్వామ్య ప్రక్రియలను, రాజ్యాంగ సంస్థలను గౌరవించాలని సూచించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో నెలకొన్న పరిస్థితులను ఉటంకిస్తూ.. హింస, తీవ్రవాదం, రాజకీయ ఘర్షణలు దేశ శాంతికి ఏ విధంగా విఘాతం కలిగిస్తాయో ఆయన వివరించారు. దేశానికి ప్రస్తుతం బాధ్యతాయుతమైన నాయకత్వం, సామాజిక సామరస్యం ఎంతో అవసరమని, ఘర్షణలు, గందరగోళం కాదని స్పష్టం చేశారు. ద్వేషం, తీవ్రవాదానికి వ్యతిరేకంగా సమాజంలో అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జాతీయవాదం, సామాజిక సామరస్యం, విద్య, సోదరభావం వంటి అంశాలపై ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా 10 అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఆర్ఎం ప్రకటించింది. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా కార్యకర్తలు హాజరయ్యారు.

ఆప్ సర్కార్‌పై అమిత్ షా ధ్వజం.. మృతుల కుటుంబాలతో భేటీకి నిర్ణయం

మొదటిపేజీ తరువాయి.. పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆప్ సర్కార్ రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల ఊబిలోకి నెడుతోందని, ఫలితంగా ఎన్నో కుటుంబాలు తమ బిడ్డలను కోల్పోవాల్సి వస్తోందని ఆయన ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా గళమెత్తినందుకు ఇటీవల హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులను తాను స్వయంగా కలిసి పరామర్శించనున్నట్లు అమిత్ షా ఆదివారం ప్రకటించారు. ఈ మేరకు తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసిన అమిత్ షా, మంగళవారం మాన్సా, సంగ్రూర్, గురుదాస్‌పూర్ జిల్లాల్లోని బాధిత కుటుంబాలతో సమావేశమవుతానని తెలిపారు. "ఆప్ ప్రభుత్వ అండదండలతో పేట్రేగిపోతున్న డ్రగ్స్ ముఠాలకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను కలుస్తాను. ఆ కుటుంబాలు అనుభవిస్తున్న వేదన వర్ణనాతీతం" అని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారానికి వ్యతిరేకంగా వినిపించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని, పంజాబ్ ప్రజలు వీటికి తగిన సమాధానం చెబుతారని షా హెచ్చరించారు. పంజాబ్ సహా యావత్ దేశం డ్రగ్స్ రహితంగా మారే వరకు కేంద్ర ప్రభుత్వం విశ్రమించదని, డ్రగ్స్ సరఫరాదారులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో పంజాబ్‌లో పలువురు డ్రగ్స్ వ్యతిరేక కార్యకర్తలు హత్యకు గురైన నేపథ్యంలో అమిత్ షా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటన ద్వారా బాధిత కుటుంబాలను ఓదార్చడంతో పాటు, రాష్ట్రంలో డ్రగ్స్ నెట్‌వర్క్‌ను సమూలంగా నిర్మూలించడానికి కేంద్రం కట్టుబడి ఉందనే విషయాన్ని ఆయన పునరుద్ఘాటించనున్నారు.

దుర్గా పూజ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి.. నారీశక్తిపై కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి.. దుర్గాపూజ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ, విదేశాల్లోని భారతీయులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ నారీశక్తికి ఇచ్చే గౌరవానికి ప్రతీక అని పేర్కొన్న ఆమె, మహిళలను గౌరవించడమే అమ్మవారికి మనం చేసే నిజమైన పూజ అని సందేశమిచ్చారు. ఈ మేరకు రాష్ట్రపతి ఒక సందేశాన్ని విడుదల చేస్తూ, చెడుపై మంచి సాధించిన విజయానికి దుర్గాపూజ నిదర్శనమని పేర్కొన్నారు. మహిషాసురుడిని దుర్గామాత సంహరించడం అనేది, దైవశక్తులు దుష్టశక్తులను ఏ విధంగా ఓడిస్తాయో చెప్పేందుకు ఒక స్ఫూర్తిదాయక నిదర్శనమని వివరించారు. ఈ పండుగ భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా మహిళల గౌరవం, సాధికారత ప్రాముఖ్యతను రాష్ట్రపతి నొక్కి చెప్పారు. "వ్యక్తిగత, సామాజిక జీవితంలోని ప్రతి అంశంలో మహిళలకు సముచిత గౌరవం కల్పించడం ద్వారానే మనం దుర్గామాత పట్ల మన నిజమైన భక్తిని చాటుకోగలం" అని ఆమె స్పష్టం చేశారు. అమ్మవారి ఆరాధనలోని ఆదర్శాలను మహిళల పట్ల గౌరవ భావంగా మలచుకోవాలని సూచించారు. దుర్గామాత ఆశీస్సులతో పౌరులందరి జీవితాల్లో సుఖశాంతులు, సమృద్ధి వెల్లివిరియాలని, దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

పండగ పూట ఛార్జీల బాదుడు.. ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

మొదటిపేజీ తరువాయి.. బతుకమ్మ, దసరా పండగల వేళ తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. పండగకు సొంతూళ్లకు వెళ్లేవారి ఉత్సాహాన్ని ఈ ఛార్జీల పెంపు దెబ్బతీసిందని ఆయన ఆరోపించారు. ఛార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ సర్వీసులను తగ్గించి, వాటినే పండగ స్పెషల్ బస్సులుగా చూపిస్తూ అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణ టికెట్ ధర రూ. 230 ఉండగా, ఇప్పుడు రూ. 400 వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు రూ. 220 ఉన్న టికెట్‌ను రూ. 290కి పైగా పెంచారని తెలిపారు. ఇదేనా మీ ప్రజాపాలన? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అయితే, ఈ ఛార్జీల పెంపు కేవలం పండగ రద్దీ కోసం నడుపుతున్న 7,000 ప్రత్యేక బస్సులకు మాత్రమే వర్తిస్తుందని టీజీఎస్ఆర్టీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథంగానే ఉన్నాయని తెలిపాయి. పండగ సమయంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చిన తర్వాత బస్సులు ఖాళీగా తిరిగి రావడం వల్ల అయ్యే నిర్వహణ ఖర్చులను భర్తీ చేసేందుకు ఈ 50 శాతం సర్ఛార్జి విధిస్తున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. 2003లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంఎస్ నెం. 16) ప్రకారమే ఈ సర్ఛార్జిని వసూలు చేస్తున్నామని, ఇది కొత్త విధానం కాదని టీజీఎస్ఆర్టీసీ చెబుతోంది. అయినప్పటికీ, పండగ వేళ ఛార్జీల పెంపు సరైంది కాదని ప్రతిపక్షాలు విమర్శిస్తుండటంతో ఈ అంశంపై రాజకీయంగా చర్చ మొదలైంది.

పుష్కరాల శోభ.. గోదావరి తీరానికి రూ.2,000 కోట్లు

మొదటిపేజీ తరువాయి.. ప్రభుత్వం కేవలం పెద్ద ఆలయాలకే పరిమితం కాకుండా చిన్న, మధ్యతరహా దేవాలయాలను కూడా అభివృద్ధి చేస్తోంది. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి అదనంగా నిధులు, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో టీటీడీ నిధులతో మండపం, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం, యాదగిరిగుట్టలో వేద పాఠశాలతో పాటు వివిధ సౌకర్యాల కోసం కోట్లాది రూపాయలు కేటాయించిన విషయాలు గమనార్హం. మేడారం జాతరకు ముందు గద్దెల విస్తరణ, సౌకర్యాల మెరుగుదలలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ చర్యలు ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పెంచి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయని అధికారులు భావిస్తున్నారు. సభలో మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని భట్టి అన్నారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాల చెక్కులు అందించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడకుండా ప్రతి చుక్కను పొదుపుగా వినియోగించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాచారం నుంచి ఉమ్మడి జిల్లాలను కలుపుతూ జూలూరుపాడు వరకు రహదారి మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరగా, మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలయాల అభివృద్ధితో పాటు రహదారులు, నీటి సౌకర్యాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు ఏకకాలంలో సాగడం ప్రభుత్వ సమగ్ర అభివృద్ధి దృక్పథాన్ని సూచిస్తోందని అన్నారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకునేలా, ఆలయాల చుట్టూ ఉన్న ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చేస్తున్న ఈ ప్రయత్నాలు తెలంగాణలో ఆధ్యాత్మిక పర్యాటకానికి కొత్త ఒరవడి తీసుకురాగలవని నాయకులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మందగమనం.. తగ్గిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు!

మొదటిపేజీ తరువాయి.. నుంచి రూ.4,487 కోట్లకు చేరింది. ఆగస్టు 2026 నెలతో పోల్చినా కూడా రిజిస్ట్రేషన్లలో 5 శాతం క్షీణత కనిపించింది. ఈ తగ్గుదల ప్రధానంగా బడ్జెట్, మధ్యశ్రేణి గృహాల విభాగంలో ఎక్కువగా కనిపించింది. ₹50 లక్షల లోపు విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు ఏకంగా 20 శాతం పడిపోగా, రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 6 శాతం తగ్గాయి. అయితే, దీనికి పూర్తి భిన్నంగా ప్రీమియం సెగ్మెంట్ నిలకడగా రాణించింది. కోటి రూపాయలకు పైబడిన విలువైన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 12 శాతం తగ్గినా, వాటి లావాదేవీల విలువలో క్షీణత కేవలం 2 శాతంగానే ఉండటం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో ఈ సెగ్మెంట్ వాటా గతేడాది 54 శాతం ఉండగా, ఈసారి అది 56 శాతానికి పెరిగింది. ఇది మార్కెట్‌లో అధిక విలువ గల గృహాలకు డిమాండ్ బలంగా ఉందని సూచిస్తోంది. సెప్టెంబర్ నెలలో అమ్మకాలు మందగించినప్పటికీ, 2026 క్యాలెండర్ సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల (జనవరి-సెప్టెంబర్) గణాంకాలను పరిశీలిస్తే మార్కెట్ నిలకడగానే ఉంది. ఈ తొమ్మిది నెలల్లో మొత్తం 55,715 యూనిట్లు రిజిస్టర్ కాగా, లావాదేవీల విలువ గతేడాది కంటే 4 శాతం పెరిగి రూ.39,910 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం గైడెన్స్ విలువల సవరణ తర్వాత నెలవారీ రిజిస్ట్రేషన్లలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రతినిధి శిశిర్ బైజాల్ మాట్లాడుతూ, "మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ, అధిక ధర కలిగిన ఇళ్ల అమ్మకాల వాటా పెరగడం వల్ల మొత్తం లావాదేవీల విలువ స్థిరంగా ఉంది. ఇది ప్రీమియం గృహాలకు కొనుగోలుదారుల నుంచి డిమాండ్ కొనసాగుతోందని స్పష్టం చేస్తోంది" అని వివరించారు. రిజిస్టర్ అయిన ప్రాపర్టీలలో 66 శాతం వాటాతో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల మధ్య ఉన్న ఇళ్లే అధికంగా ఉన్నాయి.

డిజిటల్ అరెస్ట్ పేరుతో భారీ మోసం

- రూ. 29 లక్షలు కాజేసిన ముఠాలో ఇద్దరి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్‌లో 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరిగిన భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. 63 ఏళ్ల ఓ విశ్రాంత ఉద్యోగి నుంచి రూ. 29 లక్షలకు పైగా కాజేసిన కేసులో ఇద్దరు నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నగరానికే చెందిన మహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, అహ్మద్ నజీబ్ ఉద్దీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకోగా, బెంగళూరుకు చెందిన సచిన్ అనే మరో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ ఏడాది మార్చి 3న బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు, తాము ఢిల్లీ పోలీసులు, సీబీఐ, ఈడీ అధికారులమని నమ్మబలికారు. రూ. 68 మిలియన్ల మనీ లాండరింగ్ కేసులో ఆయనకు ప్రమేయం ఉందని, ఆధార్ వివరాలుడ, వేలిముద్రలు దుర్వినియోగం అయ్యాయని బెదిరించారు. అరెస్ట్ చేస్తామంటూ నకిలీ పత్రాలను పంపి, ఇది జాతీయ భద్రతకు సంబంధించిన వ్యవహారమని, ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు, ఆయన కుమార్తె విడతల వారీగా మొత్తం రూ. 29,17,668లను నిందితుల ఖాతాలకు బదిలీ చేశారు. నిందితులు తమ మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఈ మోసానికి ఉపయోగించారని, బాధితుడి నుంచి వచ్చిన సొమ్మును విత్‌డ్రా చేసి, ఎవరికీ అనుమానం రాకుండా క్యాష్ డిపాజిట్ మెషీన్ల ద్వారా వివిధ ఖాతాల్లో జమ చేశారని అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఆ మొత్తాన్ని యూఎస్‌డీటీ (క్రిప్టో కరెన్సీ) రూపంలోకి మార్చి, నిందితులు తమ కమీషన్ తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాట్సాప్ ద్వారా సచిన్‌తో చేతులు కలిపి ఈ నేరానికి పాల్పడినట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి.. పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు. పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు. ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

ఢిల్లీ వీధుల్లో కొత్త పోరు.. సీజేపీకి పోటీగా ఢిల్లీలో 'లాల్ హిట్ జనతా పార్టీ'

మొదటిపేజీ తరువాయి.. దేశ రాజధాని ఢిల్లీలో కొత్త రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్‌రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) చేపట్టిన నిరసనలకు వ్యతిరేకంగా మరో కొత్త గ్రూప్ ఆవిర్భవించింది. 'లాల్ హిట్ జనతా పార్టీ' పేరుతో ఏర్పడిన ఈ బృందం, సీజేపీ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్య పరిరక్షణే తమ లక్ష్యమని ఈ పార్టీ ప్రకటించింది. నిన్న ఢిల్లీలోని మాళవియా స్మృతి భవన్‌లో 'లాల్ హిట్ జనతా పార్టీ' తమ తొలి సభ్యత్వ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి పార్టీ చీఫ్ అయాన్ భట్నాగర్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకోవడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అతి తక్కువ సమయంలో కూడా తాము పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించగలమని నిరూపించడమే ఈ సమావేశం ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రజలు ఇకపై సోషల్ మీడియాలో చర్చలకే పరిమితం కాకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సీజేపీ చేపట్టిన నిరసనల వల్ల దేశంలోని రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవానికి భంగం కలుగుతోందని అయాన్ భట్నాగర్ ఆరోపించారు. వారి ఆందోళనల కారణంగా వ్యాపారాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, పోలీసు సిబ్బందితోనూ ఆందోళనకారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ముఖ్యంగా పండుగల సీజన్‌లో కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో నిరసనలు చేపట్టడం వల్ల వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు వక్తలు కూడా సీజేపీ నిరసనలను తప్పుబట్టారు. రాజ్యాంగ సంస్థలకు, ప్రభుత్వానికి మద్దతుగా నిలవాల్సిన ఆవశ్యకతను వారు నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికే 'లాల్ హిట్ జనతా పార్టీ'ని ఏర్పాటు చేశామని, దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా అడ్డుకుంటామని వారు స్పష్టం చేశారు.

పూల జాతర.. సంస్కృతికి ప్రతీక

నర్సంపేట గడ్డపై మిన్నంటిన సద్దుల సంబరం

మురిసిన పల్లె.. మైమరిచిన పట్టణం.. భక్తిశ్రద్ధలతో గంగమ్మ ఒడికి చేరిన గౌరమ్మ..

ఉద్యమ పోరు, నర్సంపేట, అక్టోబర్ 18 : తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకైన సద్దుల బతుకమ్మ సంబరాలు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం రాత్రి అంబరాన్నంటాయి. తొమ్మిది రోజుల పాటు సాగిన పూల జాతర చివరి రోజైన సద్దుల పండుగ వేళ పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి గల్లీ మురిసిపోయింది. తీరొక్క పూల సింగారాలు, కోలాటాల చప్పుళ్లు, జానపద పాటల హోరుతో నర్సంపేట ప్రాంతమంతా ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభతో పులకించింది.

తీరొక్క పూలతో విశ్వరూపం

ఆదివారం తెల్లవారుజాము నుంచే నియోజకవర్గంలోని ప్రతి ఇంటా సందడి వాతావరణం నెలకొంది. ఆడపడుచులు అడవులు, వాగుల వెంబడి వెళ్లి సేకరించిన తంగేడు, గునుగు, కట్ల, చామంతి, బంతి, గులాబీ తదితర ప్రకృతి పూలతో తాంబాలాల్లో బతుకమ్మలను గోపురాల్లా పేర్చారు. గునుగు పూలకు సహజ రంగులు అద్ది, శిఖరాన పసుపు గౌరమ్మను కొలువుదీర్చి అలంకరించిన తీరు కనువిందు చేసింది. చిన్న బతుకమ్మల నుంచి భారీ బతుకమ్మల వరకు ప్రతి ఒక్కటి మహిళల సృజనాత్మకతకు అద్దం పట్టింది.

వయస్సు మరచి.. లయబద్ధంగా అడుగులు

సాయంత్రం నాలుగు గంటల నుంచే మహిళలు, యువతులు, చిన్నారులు పట్టుచీరలు, లంగాఓణీలు ధరించి సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోయారు. పడుచు పిల్లల నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరూ బతుకమ్మలను నెత్తిన ఎత్తుకుని ప్రధాన కూడళ్లు, ఆలయ ప్రాంగణాలు, సామూహిక మైదానాలకు తరలివచ్చారు. బతుకమ్మలను నడిబొడ్డున ఉంచి చుట్టూ వలయాకారంలో తిరుగుతూ "శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ..", "ఒక్కేసి పువ్వేసి చందమామ..", "చిత్తూ చిత్తూల బొమ్మ.." అంటూ గొంతు కలిపి పాడిన పాటలు పరిసరాలను మారుమోగించాయి. మహిళలు లయబద్ధంగా ఆడిన కోలాటాలు, చప్పట్ల సవ్వళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి

ఘనంగా శోభాయాత్ర.. గంగమ్మ ఒడికి గౌరమ్మ

రాత్రి పొద్దుపోయాక మహిళలు తమ వెంట తెచ్చుకున్న తొమ్మిది రకాల సద్దులు—నువ్వుల సద్ది, పల్లీ సద్ది, పెరుగన్నం, పులిహోర, కొబ్బరి సద్ది తదితర నైవేద్యాలను గౌరమ్మకు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అనంతరం బాణాసంచా వెలుగులు, డప్పు వాయిద్యాల నడుమ బతుకమ్మలను నిమజ్జన ప్రాంతాలకు శోభాయాత్రగా తరలించారు. నర్సంపేట పరిసర చెరువులు, కాలువలు, ప్రధాన జలాశయాల వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి, "పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా" అంటూ భక్తిభావంతో బతుకమ్మలను గంగమ్మ ఒడికి చేర్చారు.

వెల్లివిరిసిన ఆత్మీయత

నిమజ్జనం అనంతరం చెరువు గట్లపై మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చుకుని, పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. వెంట తెచ్చుకున్న సద్దులను బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారికి పంచుకుంటూ పండు గ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పరస్పర ప్రేమాభిమానాలు, ఆత్మీయ కలయికలతో నర్సంపేట నియోజకవర్గంలోని వీధులన్నీ పండుగ వేళ ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయి.

పకడ్బందీ ఏర్పాట్లు..

సద్దుల బతుకమ్మ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు ముందస్తు ఏర్పాట్లు చేశారు.

విద్యుద్దీపాలు : ప్రధాన కూడళ్లు, చెరువు కట్టల వద్ద ప్రత్యేకంగా ఫ్లడ్ లైట్లు, ఆకర్షణీయమైన విద్యుత్ తోరణాలు ఏర్పాటు చేశారు.

పారిశుధ్యం & బారికేడ్లు: మున్సిపల్, పంచా యతీ సిబ్బంది నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షించగా, చెరువు లోతు ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు : శాంతిభద్రతల పరిరక్షణ కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
సోమవారం 19.10.2026

శాస్త్రీయ సమాజ నిర్మాణానికై కదిలి రండి

- జెవివి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ రజిని

ఉద్యమ పోరు, నర్సంపేట, అక్టోబర్ 18 : నర్సంపేట లోని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గుగులోతు సుధాకర్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెవివి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ రజిని మాట్లాడుతూ శాస్త్రీయ ఫలాలను సామాన్యుల చెంతకు చేర్చి ప్రజలందరిలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం కోసం నిరంతరం కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణానికై తోడ్పడండి అని విజ్ఞప్తి చేశారు మానవుడు రాతియుగం నుండి రాకెట్ యుగంలోకి చేరుకున్నప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో పురోగతిని సాధించినప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు పట్టణ ప్రాంతాల్లో కూడా విద్యావంతులైన ప్రజలు కూడా మూఢ నమ్మకాల భారీ లో పడి తమ జీవితాలను నష్టపరుచుకుంటున్నారని వీటన్నింటినీ సామరస్యం గా పరిష్కరించి ప్రజల్లో అవగాహన కల్పించి వాటి గల మూల కారణాలను ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరిచినప్పుడే ఈ దేశం సుస్థిరమైన అభివృద్ధిని సాధిస్తుందని అన్నారు ఈ బృహత్తర కార్యక్రమంలో జీవివి కి చేయూతనందించి ప్రజలలో చైతన్యాన్ని కలిగించడానికి విద్యావంతులైన ప్రతి ఒక్కరూ బాధ్యత గా భావించి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కదిలి రావాలని పిలుపునిచ్చారు జె వి వి వరంగల్ జిల్లా కమిటీ సామాజిక దృక్పథం కలిగిన శాస్త్రీయ అవగాహన కలిగిన చిరుకైన కార్యకర్తలతో నిర్మింపబడి ముందుకు సాగుతుండడం అభినందనీయమని జీవివి జిల్లా ఆరవ మహాసభలలో తీసుకున్న నిర్ణయాలని ఆరవ రాష్ట్ర మహాసభలు అందించిన కార్యక్రమాలని ప్రణాళికబద్ధంగా నిర్వహిస్తూ ప్రజలలో చిన్నారి విద్యార్థిని విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన కలిగించడం కోసం విరివిగా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ జితేందర్ మాట్లాడుతూ నవంబర్ మాసంలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు 2026 ను స్ఫూర్తిదాయకంగా నిర్వహించాలని జిల్లా కమిటీ సమన్వయంతో సమిష్టిగా కృషి చేసి ఈ సంబరాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు దాదాపు 15 వేల మంది విద్యార్థిని విద్యార్థులను చకుముకి సంబరాలలో భాగస్వామ్యం చేయడానికి ముందుకు వచ్చినటువంటి వరంగల్ జిల్లా కమిటీని అభినందించారు నర్సంపేట కేంద్రంగా వరంగల్ జిల్లా కార్యక్రమాలను నిర్వహించడం ప్రశంసనీయమని ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం తన హాస్పిటల్ భవనంలో ని హాల్ను జిల్లా జెవివి కార్యాలయానికి ఇచ్చి ప్రోత్సహిస్తున్నటువంటి ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.ఎం జయుడుని అభినందించారు రాష్ట్ర కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు విస్తృత స్థాయి సమావేశ ప్రారంభానికి ముందు రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ రజిని మేడం జె వి వి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జె వి వి గౌరవాధ్యక్షులు విఎం జయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాక శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు వి మాధవి రెడ్డి ,పాల కుమారస్వామి, కోశాధికారి బూరుగు నవీన్ ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ శంకర్, డాక్టర్ పెండెం భాస్కర్, మోతే ఇంద్రసేనారెడ్డి, అడ్వకేట్ సుమతి మేడం, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి చాగంటి యాకయ్య,డాక్టర్ ఉషా ఉదయ్ సింగ్, డాక్టర్ జ్యోతి మేడం, శ్వేత, కుమార్ రెడ్డి, సురేష్, పి కుమార్, మోతిలాల్, నరసింహ, జగన్, ఎండి రాయబోస్ మరియు జిల్లా ప్రతినిధులు వివిధ మండలాల చెకుముకే కన్వీనర్స్ పాల్గొన్నారు ప్రధాన కార్యదర్శి పాక శ్రీనివాస్ వందన సమర్పణతో జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు విజయవంతంగా ముగిశాయి.

త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు

- **అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

ఉద్యమ పోరు, నర్సంపేట, అక్టోబర్ 18 : త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు ఈరోజు బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి గారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నర్సంపేట నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తి భావాన్ని మరియు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న త్రిశూల్ యూత్ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, బిజెపి నియోజకవర్గ నాయకులు జూలూరు మనీష్ గౌడ్, బీజేవైఎం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, కొంకిసా విగ్నేష్ గౌడ్, ఠాకూర్ విజయ్ సింగ్ , అబ్బర బోయిన రాజు, చిలువేరు అన్వేష్, త్రిశూల్ యూత్ సభ్యులు కందగట్ల చిన్ని కృష్ణ , ఆముదాల శ్రీనివాస్, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ఉద్యమ పోరు, దుగ్గొండి, అక్టోబర్ 18 :
దుగ్గొండి మండలం చాపలబండ గ్రామంలో ఆడపడుచుల ఆరాధ్య దైవమైన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని నర్సంపేట శాసన సభ్యులు గౌరవ శ్రీ దొంతి మాధవరెడ్డి గారు ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు మాట్లాడుతూ.. బతుకమ్మ తల్లి విగ్రహం మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వీరాటి లింగారెడ్డిని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి

ఉద్యమ పోరు, వరంగల్, అక్టోబర్ 18 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలం కొమ్మాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరాటి లింగారెడ్డి గారు ప్రమాదవశాత్తు గాయపడి హన్మకొండలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మాజీ ఎమ్మెల్యే గారి వెంట పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పొన్నాల గోవర్ధన్ ని సన్మానించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

- బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి...

ఉద్యమ పోరు, చెన్నారావుపేట, అక్టోబర్ 18 : చెన్నారావుపేట మండలానికి నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పొన్నాల గోవర్ధన్ ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బాల్నే వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చెన్నారావుపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీని చింపివేసిన ఘటనపై బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న మండల నాయకులు, స్థానిక నాయకులు నూతన ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి విచారణ జరిపి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్లు చింతకింది వంశీ, మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లు అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, మాజీ కో ఆప్షన్ మెంబర్ రఫీ, మండల ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, మాజీ సర్పంచ్ కుండే మల్లయ్య, గుగులోతు స్వామి నాయక్, మాజీ డైరెక్టర్ జున్నుతుల శ్రీధర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మాదాసి కుమారస్వామి, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, మండల నాయకులు ములుక సాంబయ్య కవి, రసమల సతీష్, సురేందర్, జైపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందగట్ల సాంబయ్య, మొర్రి కట్టయ్య, పార్టీ నాయకులు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం పంపిణీ

- **రూ.5 లక్షల చెక్కును అందజేసిన ప్రభుత్వ సలహాదారు, కలెక్టర్**
- **ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ**

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 18 : భీంగల్ మండల కేంద్రంలో ఇటీవల సుధాకర్ (60) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి బలవన్మరణం చెందగా,బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించారు.భీంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతుని సతీమణి సరోజ,కుమారుడు శ్రీనివాస్ లకు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ ఇలా త్రిపాఠిల చేతుల మీదుగా రూ.5లక్షల చెక్కును అందజేశారు.బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,భీంగల్ మున్సిపల్ చైర్మన్ నాగమణి,రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,తహసీల్దార్ కిరణ్,నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లెంకలపల్లి గ్రామంలో తీవ్ర విషాదం

- ట్రాక్టర్ కింద పడి నాలుగేళ్ల బాలుడు మృతి ?

ఉద్యమ పోరు, నల్లబెల్లి, అక్టోబర్ 18 : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకలపల్లి గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విధి రాతలో కాలయముడు కాటేయడంతో నాలుగేళ్ల చిరునవ్వుల బాలుడు అనంత లోకాలకు వెళ్లిపోయాడు.గ్రామానికి చెందిన నానబోయిన కిరణ్ - పావని దంపతుల నాలుగేళ్ల కుమారుడు నెహంత్ (చెర్రీ) శనివారం ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. కళ్ల ముందే కంటికి రెప్పలా చూసుకుంటున్న చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ హృదయవిదారక ఘటనతో లెంకలపల్లి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.పార్థివదేహానికి నివాళులు అర్పించిన బిఆర్ఎ స్ నాయకులుచిన్నారి నెహంత్ మరణవార్త తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నల్లబెల్లి మండల అధ్యక్షుడు భానోత్ సారంగపాణి లెంకలపల్లికి చేరుకుని బాలుడి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం అంతిమయాత్ర లో స్వయంగా పాల్గొని చిన్నారి పాడె మోశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "పసిపాపను కాలయముడు కబళించడం అత్యంత బాధాకరం. బాలుడి మృతి లెంకలపల్లి గ్రామానికి తీరని లోటు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శోక సంద్రంలో మునిగిపోయిన తల్లిదండ్రులు కిరణ్ - పావని దంపతులను, కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ చెట్టుపల్లి మురళి , బిఆర్ ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి అశోక్ , బిఆర్ ఎస్ నందిగామ గ్రామ పార్టీ అధ్యక్షులు గండు శ్రీధర్ , బిఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఇతరులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారునికి అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

ఆర్కే పురం డివిజన్ పరిధిలో వివిధ విభాగాల్లో పనిచేసే మహిళ కార్మికులకు దసరా కానుకగా చీరలు పంపిణీ చేసిన

- చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

ఉద్యమపోరు, ఆర్కే పురం, అక్టోబర్ 18 : ఆర్కే పురం డివిజన్ పరిధిలోని పారిశుద్ధ కార్మికులకు దేవాలయాల్లో పనిచేసే మహిళలకు దసరా కానుకగా చీరలు పంపిణీ చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయ కులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి నిత్యం సమాజ సేవలో నిమ గ్నమ య్యే మహిళా కార్మికులకు దసరా కానుకగా ప్రతి సంవ త్సరం లాగే ఈ ఏడాది కూడా చీరలు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. దీనిని ఒక బాధ్యతగా తీసుకొని రాబోయే రోజులలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుక పోతామని తెలియజేశారు.

దుర్గామాతకు జరుపల శివకృష్ణ

- లావణ్య దంపతుల ప్రత్యేక పూజలు

- **దుర్గామాత మాలాధారణ స్వాములకు ప్రసాద వితరణ**

ఉద్యమపోరు, బోనకల్, అక్టోబర్ 18 : బోనకల్ మండల కేంద్రంలోని బంజారా హిల్స్ రోడ్ నెంబర్ వన్ మాజీ జెడ్పిటిసి బానోతు కొండ కాంప్లెక్స్ రోడ్డు లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారిని జరుపల శివకృష్ణ– లావణ్య దంపతులు మరియు కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి పూజలు చేసి తమ కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని ప్రార్థించారు.అనంతరం తమ నివాసంలో దుర్గామాత మాలాధారణ చేసిన స్వాములకు ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. భక్తితో అమ్మవారిని ఆరాధిస్తూ, మాలాధారణ స్వాములకు ప్రసాదం అందించడం ద్వారా తమ ఆధ్యాత్మిక భక్తిభావాన్ని చాటుకున్నారు.దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తాయని, ఇలాంటి కార్యక్రమాలు భక్తుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి కొండ, హారిక, దీప్తిగాయని, జశ్విత, గుగులోతు నాగేశ్వరరావు, జరుపల చిన్న, దుర్గ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు.

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ వేడుకలు**
- **దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆటపాటలతో సందడి చేస్తున్న మహిళలు**

ఉద్యమపోరు, బోనకల్, అక్టోబర్ 18 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు బోనకల్ మండల కేంద్రంలో ఘనంగా కొనసాగుతున్నాయి. బంజారా హిల్స్ రోడ్ నంబర్ 1లోని మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ కాంప్లెక్స్ రోడ్డు వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహిళలు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలతో సందడి చేస్తున్నారు.బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది. వర్షాకాలంలో విరబూసే తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలలో దైవత్వాన్ని దర్శించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగలో కనిపిస్తుంది. మహిళలు తమ కుటుంబాల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మను ఆడటం ఈ పండుగ గొప్పతనాన్ని చాటుతుంది. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బతుకమ్మ పాటలు ఆలపిస్తూ చేసే సంబరాలు పండుగ వాతావరణాన్ని మరింత శోభాయమానంగా మారుస్తున్నాయి.ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలతో పాటు బతుకమ్మ సంబరాలకు ఏర్పాట్లు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం కలగలిసిన ఈ వేడుకలు స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భావితరాలకు పరిచయం చేస్తూ, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలతో బోనకల్‌లో పండుగ సందడి నెలకొంది. మహిళల ఆటపాటలు, భక్తిగీతాలు, రంగురంగుల పూల బతుకమ్మలతో ఉత్సవ ప్రాంగణం కళకళలాడుతోంది.

ఆళ్లపల్లిలో ఘనంగా బతుకమ్మ విగ్రహ ఆవిష్కరణ..

- **తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించాలి**
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ఉద్యమపోరు, ఆళ్లపల్లి, అక్టోబర్ 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని ఆళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాల ప్రాధాన్యతను ఆయన వివరించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతిరూపంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ గొప్ప సంప్రదాయాన్ని కాపాడుకుంటూ, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.గ్రామాల్లో నిర్వహించే ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంప్రదాయాల పట్ల యువతలో అవగాహనను పెంచుతాయని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ, మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు.ఆళ్లపల్లి గ్రామంలో బతుకమ్మ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొంటూ, గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రజలందరూ సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A7716
ఉద్యమ పోరు
ప్రతి పదం పోరాట కదం
సోమవారం 19.10.2026

శ్రీ మహాశక్తి దేవాలయంలో భవానీ దీక్షలో కేంద్ర మంత్రి :బండి సంజయ్ కుమార్

- **మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి రాష్ట్ర నాయకులు నిట్టు శ్రీశైలం.**

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 : ఆదివారం కరీంనగర్ నగరం లోని చైతన్యపురి కాలనీలో ప్రసిద్ధ శ్రీ మహాశక్తి దేవాలయంలో దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా గత కొద్దిరోజులుగా ఆలయ ప్రాంగణంలోనే ఉంటూ భవానీ దీక్షను కొనసాగిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు,కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ని బిజెపి రాష్ట్ర నాయకులు నిట్టు శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిశారు.బీజేపీ రాష్ట్ర నాయకులతో కలిసి నిట్టు శ్రీశైలం.శ్రీ మహాశక్తి ఆలయంలో కొలువై ఉన్న అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం,దీక్షా శిబిరంలో ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ని కలిసి వారికి నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పలు రాజకీయ, సామాజిక అంశాలతో పాటు పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై కేంద్ర మంత్రితో నిట్టు శ్రీశైలం సుదీర్ఘంగా చర్చించారు.జిల్లా ప్రగతికి సంబంధించిన పలు విషయాలను బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా, వారు సానుకూలంగా స్పందించారు.వారితో పాటు బిజెపి రాష్ట్ర నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

వశిష్ఠ జ్యువెలరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 18 : నిజామాబాద్ నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వశిష్ఠ జ్యువెలరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పాల్గొన్నారు.ఈ సందర్భంగా జ్యువెలరీ ప్రారంభించిన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.నిజామాబాద్ నగరం వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందుతూ,నూతన వ్యాపార సంస్థలకు కేంద్రంగా ఎదగడం సంతోషకరమని పేర్కొన్నారు.

తమ్మిచెరువుపై మూడేళ్లుగా నిర్లక్ష్యం

- **మట్టి తవ్వకాలపైనే పాలకుల శ్రద్ధ.. పుట్ట మధూకర్ విమర్శ**

ఉద్యమపోరు, మంథని, అక్టోబర్ 18 : మంథని పట్టణంలోని తమ్మిచెరువు సుందరీకరణ పనులను మూడేళ్లుగా పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ప్రజల మనోభావాల కంటే మట్టి తవ్వకాలపైనే ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడికి శ్రద్ధ ఎక్కువగా ఉందని ఆరోపించారు. ఆదివారం తమ్మిచెరువును సందర్శించిన ఆయన, నిలిచిపోయిన పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.గతంలో తమ హయాంలో చెరువు అభివృద్ధి పనులు 70 శాతం పూర్తయ్యాయని, బతుకమ్మ ఘాట్లు, బోటింగ్, రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని అన్నారు. రోడ్ల పనులపై చూపుతున్న శ్రద్ధ చెరువు అభివృద్ధిపై చూపడం లేదని, కమీషన్ల కోసమే కోట్ల రూపాయల పనులను తొలగించి మళ్లీ చేపడుతున్నారని ఆరోపించారు.తమ్మిచెరువు వద్ద బతుకమ్మ ఘాట్లు ఏర్పాటు చేసి, బోటింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగిస్తామని పుట్ట మధూకర్ స్పష్టం చేశారు.

నిజామాబాద్‌లో టి ఆర్ పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి నిధి అగర్వాల్

ఉద్యమపోరు, నిజామాబాద్, అక్టోబర్ 18 : దక్షిణాది సినీ నటి నిధి అగర్వాల్,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ,తొడుపునూరి శ్రీనివాస్,పాలభట్ల ఆనంద్ బాబు కలిసి నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన టిఆర్పి విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌ను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ....నిజామాబాద్‌లో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ మూడవ బ్రాంచ్(హైదరాబాదులో రెండు) ప్రారంభించడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.టిఆర్పి విశిష్టలో సంప్రదాయ కళాత్మకతను ఆధునిక శైలితో మేళవించిన విభిన్నమైన డిజైన్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని తెలిపారు.ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ....నిజామాబాద్ కు ప్రతి షోరూమ్ ప్రతి బ్రాండ్ రావడం ఎంతో గర్వంగా ఉందని మరిన్ని ఇతర బ్రాండ్లు హైదరాబాద్ తో సమానంగా నిజామాబాద్ లో ఏర్పాటు చేయాలని ఇక్కడ ఉన్న వారికి ఉపాధి అవకాశాలు,పట్టణ అభివృద్ధి మరింత పెరగాలి అని తెలిపారు.తొడుపునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ....సంప్రదాయ ఆభరణాల తయారీ నైపుణ్యాన్ని ఆధునిక డిజైన్లతో సమన్వయం చేస్తూ అద్భుతమైన ఆభరణాల కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.మహిళలు,పురుషుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బంగారు,వజ్రాభరణాలతో పాటు నెక్లెస్‌లు,బ్రాస్‌లెట్లు,చెవి ఆభరణాలు,ఉంగరాలు తదితర విస్తృత శ్రేణి ఆభరణాలు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.నైపుణ్యం కలిగిన కళాకారులు ప్రతి ఆభరణాన్ని ఎంతో శ్రద్ధతో,నైపుణ్యంతో ప్రత్యేకమైన డిజైన్లలో రూపొందిస్తారని తెలిపారు.వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా తమకు నచ్చిన ప్రత్యేకమైన ఆభరణాలను రూపొందించుకునేందుకు కస్టమైజ్డ్ జ్యువెలరీ డిజైన్ సేవలను కూడా అందిస్తున్నామని పాలభట్ల ఆనంద్ బాబు పేర్కొన్నారు.నిధి అగర్వాల్ రాకతో షోరూమ్ ప్రారంభోత్సవం సందడిగా మారింది.ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అభిమానులకు నిధి అగర్వాల్ ఆప్యాయంగా అభివాదం చేస్తూ సందడి చేయడంతో కార్యక్రమానికి మరింత ఆకర్షణ చేకూరింది.

ఙుగోపాలస్వామి భజన మండలి దుర్గామాత వద్ద అన్నదాన ప్రసాదం

- **దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్**
- **ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ పాలకవర్గం సభ్యులు**

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 : మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి వేణుగో పాలస్వామి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత మండపం ప్రాంగ ణంలో.దాతల సహకారంతో అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా దుర్గామాత కు ప్రత్యేక పూజలు చేసిన గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ గ్రామపంచాయతీ పాలకమం డలిసభ్యులు పెద్దలు మారగోని మాసయ్యగౌడ్ గోగిరెడ్డి అంజిరెడ్డి మాజీఎంపిటిసి చీరాల రమేష్ ప్రజాసంఘాలనాయకుడు కంబాలపల్లి భాస్కర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ అనం తరం భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించారు అన్నప్రసాద కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులను గ్రామపెద్దలను వేణుగోపాల స్వామిభజన మండలి సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈకార్యక్రమంలో అన్నప్రసాద ప్రభువులు గ్రామపంచాయతీ వార్డుస భ్యులు పున్నం రాము పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ మంకు మమతా వినోద్ మంద మాధవి మోహన్ రెడ్డి,మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ మాడుగుల బాలమణి కృష్ణగౌడ్ మొల్రిపద్మ ఐ లయ్య,లాలగారి మణెమ్మ వేణుగోపాలస్వామి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు అన్నప్ర సాద దాతలు నూతనగంటి రాకేష్ జ్ఞాపకార్థంగా నాలుగు క్వింటాల బియ్యం దాత నూతన గంటి లక్ష్మయ్య,కూరగాయల దాత మాధగోని ఎల్లేష్ గౌడ్ ,టెంట్ సామాగ్రి దాత మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ ,మాధగోని కాటంరాజు గౌడ్ ,10వేలు లైఫ్ క్యూర్ మెడిక ల్ షాప్ మహమ్మద్ రాహుపు 10 వేలు పాలమోని శివమణి ముదిరాజ్ 10వేలు అంతటి శ్యామ్ గౌడ్ 10వేలు పల్లవి డీజే సౌండ్ గుడ్డిమల్ల భాస్కర్ ముదిరాజ్ 10వేల రూపాయలు ఇంకా చాలామంది దాతలు అన్నప్ర సాద కార్యక్ర మానికి విరాళాలు అందజేశారు ఈసందర్భంగా అన్నప్రసాద కార్యక్రమానికి సహక రించిన ప్రతి ఒక్కరికి వేణుగోపాల భజన మండలి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈకార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రంగంలో గ్రామీణ యువత రాణించాలి: ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 18 : గ్రామీణ ప్రాంత యువత చదువుతో పాటు క్రీడారంగంలోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం తాళ్లగుట్ట తండాలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన ఆయన, టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులకు రూ.20,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అనంతరం రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు యువతకు శారీరక దృఢత్వాన్ని ఇవ్వడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయన్నారు.జట్టుగా పనిచేయడం,గెలుపోటములను సమానంగా స్వీకరించడం వంటి ఉత్తమ విలువలు క్రీడల ద్వారా అలవడుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అద్భుతమైన ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన ప్రోత్సాహం అందిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి గ్రామాలకు మంచి పేరు తీసుకురాగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.యువత అభివృద్ధికి, క్రీడల ప్రోత్సాహానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తమ తండాలో టోర్నమెంట్ నిర్వహణకు పెద్దమనసుతో రూ.20,000/- ఆర్థిక సహాయం అందించి, యువతను ఉత్సాహపరిచిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డికి టోర్నమెంట్ నిర్వాహకులు, తండా వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆర్. కిషన్, యూత్ ప్రెసిడెంట్ ఆర్. చిన్నకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యాదయ్య, నాయకులు భాను చందర్, హరికిషన్, రంజిత్, కుమార్, సురేష్, హన్నా, ప్రదీప్, అరుణ్, పవన్, బక్కి, కిషన్, అశోక్, జండర్, వినోద్, రమేష్, రతన్, నవీన్, కోటేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ పల్లె చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లను పరిశీలించిన : మంత్రి పొన్నం ప్రభాకర్

- పెండింగ్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి
- మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ పండుగ జరుపుకోవాలి మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యమపోరు, హుస్నాబాద్, అక్టోబర్ 18 : హుస్నాబాద్ పట్టణంలోని పల్లె చెరువు వద్ద బతుకమ్మ పండుగ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.ఈ సందర్భంగా పల్లె చెరువు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. మహిళలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆటపాటలతో, ఆనందోత్సాహాల మధ్య పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. బతుకమ్మ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవ

సరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మోర్చ ప్రతినిధి అధికారిగా గొల్లపల్లి వీరాచారి నియామకం

- కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆశీస్సులతో

ఉద్యమపోరు, హుస్నాబాద్, అక్టోబర్ 18 : భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ప్రతినిధిగా గొల్లపల్లి వీరాచారి నియామకం పట్ల వీరాచారి వ్యక్తం చేశారుఈ నియామక పత్రాన్ని రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు బస్వ లక్ష్మీ నరసయ్య అందజేయడం జరిగింది నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన పల్లి ప్రవీణ్ రావు హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి గారికి,మరియు అక్కన్నపేట మండల అధ్యక్షులు, నా నీ అని తేడా బేధం లేకుండా అందరిని కలుపుకునే వ్యక్తి రామంచ మహేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ అధికారం లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేస్తామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది

కుకునూర్‌పల్లి పెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- విశేష పూజలు.. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ

ఉద్యమపోరు, కుకునూర్‌పల్లి, అక్టోబర్ 18 : సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ ఇండ్ల కనకయ్య ముదిరాజ్, ఆలయ పురోహితులు శివ గోవింద శర్మ మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం తర్వాత కుకునూర్‌పల్లి పెద్దమ్మ తల్లి ఆలయం కూడా అత్యంత మహిమాన్వితమైన క్షేత్రంగా భక్తుల విశ్వాసాన్ని పొందిందని పేర్కొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా అమ్మవారు విరాజిల్లుతున్నారని తెలిపారు. ఈ నెల బుధవారం గ్రామంలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుకునూర్‌పల్లి

ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు ఈగ ప్రశాంత్ ముదిరాజ్, కోశాధికారి అన్నమైన బాల్ నర్సయ్య ముదిరాజ్, కొంతం రవీందర్, కొంతం నాగరాజు, గ్యారమైన స్వామి, మహిళలు, చిన్నారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ దేశంలో ఎత్తైన కొండలను అధిరోహించిన : జానపాటి నగేష్ యాదవ్

ఉద్యమపోరు, గుర్రంపోడు, అక్టోబర్ 18 : నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం బోడపాడు గ్రామానికి చెందిన జానపాటి నగేష్ యాదవ్ నేపాల్ దేశంలో అన్నపూర్ణ బేస్ క్యాంప్ అచీవ్మెంట్ కార్యక్రమంలో భాగంగా నేపాల్ దేశంలోని అతి ఎత్తైన కొండలను అధిరోహించినట్లు ఆదివారం తెలిపారు.నేపాల్ దేశంలో నిర్వహించిన అన్నపూర్ణ బేస్ క్యాంపులో ఒంటరిగా 4,130 మీటర్ల ఎత్తులో ఉన్న 80 కిలోమీటర్ల పర్వత ప్రాంతాన్ని మూడు రోజులలో చేరుకున్నానని మధ్యలో దట్టమైన అడవులు ఎత్తైన కొండలు ఉన్న ప్రాంతంలో మైనస్ 8 డిగ్రీల చలిలో వెనకడుగు వేయకుండా కొండలను అధిరోహించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జానపాటి నగేష్ యాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తనకు సహకరిస్తే ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి దేశానికి పేరు తెస్తానని పేర్కొన్నారు. నేపాల్ దేశంలో అన్నపూర్ణ బేస్ క్యాంపు కార్యక్రమంలో పాల్గొని ఇంతటి ఘన విజయాన్ని సాధించిన జానపాటి నగేష్ యాదవ్ కు బోడపాడు గ్రామస్తులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

బంగారు బతుకమ్మ వేడుకల వేళ.. సమ్మె శిబిరంలో నిరసన బతుకమ్మ

- ఏడో రోజుకు చేరిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె
- ఉద్యోగ భద్రత, న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యం
- నిరసన బతుకమ్మతో ప్రభుత్వానికి తమ ఆవేదన

ఉద్యమపోరు, వికారాబాద్ , అక్టోబర్ 18 : వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బంగారు బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తెలిపారు. నిరవధిక సమ్మె ఏడో రోజుకు చేరుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి తమ ఆవేదనను శాంతియుతంగా తెలియజేయాలని నిర్ణయించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రత, ఆత్మగౌరవం, కుటుంబాల భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ఒకవైపు బతుకమ్మ సంబరాలు జరుగుతుండగా, మరోవైపు తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరసన బతుకమ్మ ద్వారా తమ గళాన్ని వినిపించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి ఉద్యోగులందరూ ఐక్యంగా తరలివచ్చి విజయవంతం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగుల ఐక్యతే ఉద్యమానికి బలమని, తమ న్యాయమైన డిమాండ్లకు పరిష్కారం లభించే వరకు సమిష్టిగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

NATIONAL HEALTH MISSION
राष्ट्रीय स्वास्थ्य मिशन

తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగ

- కోహెడ మండలం మాజీ ఎంపీపీ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్

ఉద్యమపోరు, కోహెడ , అక్టోబర్ 18 : బస్వాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ కార్యక్రమంలో కోహెడ మండలం మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి గారు తోటి మహిళలతో బతుకమ్మ ఆడుతూ బతుకమ్మ పాటలు పాడారు మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి గారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగతీరొక్క పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ అక్కాచెల్లెళ్ల ఆత్మీయతను ఆడపడుచుల ఐక్యతను చాటే గొప్ప పండుగ బతుకమ్మ తొమ్మిది రోజులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగకు సద్దుల బతుకమ్మతో ఘనమైన ముగింపు పలుకుతాం తెలంగాణ ఆడబిడ్డలు ఎక్కడ ఉన్నా బతుకమ్మను మర్చిపోకుండా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనం మన పండుగలను మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందిఅని ఆమెకొనియాడారుఅనంతరంమాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ గారు బస్వాపూర్ గ్రామ ప్రజలకు కోహెడ మండల ప్రజలందరికీసద్దుల బతుకమ్మ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మోత్కులపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్

ఉద్యమపోరు, అక్కన్నపేట, అక్టోబర్ 18 : మోత్కులపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజు నాయక్ ముఖ్య అతిథిగా హాజరై, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ భక్తిశ్రద్ధలతో బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ ప్రజలు ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏల్పుగొండ కొమురమ్మ , రవీందర్ వార్డు సభ్యులు గ్రామ శాఖ అధ్యకులు కందరపు రాజమౌళి, మాజీ సర్పంచ్లు గోర్ల కుమారస్వామి, రాగుల సమ్మయ్య, పెద్దతండ మాజీ సర్పంచ్ సక్ర నాయక్,brs నాయకులు బావు సదానందం, పంజసంపతి, యూత్ అధ్యక్షులు గుండ్రబోన రాజు,ప్రజలు, మహిళలు ఆడపడుచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

ఉద్యమపోరు, నిజామాబాద్ రూరల్ సిరికొండ, అక్టోబర్ 18 : సిరికొండ మండలం తాళ్ల రామడుగు గ్రామంలో ఆడపడుచులు ఎంతో ఉత్సాహంగా, సాంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడుతున్న సుందరమైన దృశ్యం ఇది. తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మన గ్రామంలో ఇలా ఆనందోత్సాహాలతో జరుపుకోవడం చాలా సంతోషకరం గ్రామంలోని మహిళలు మరియు యువతులు అందరూ కలిసికట్టుగా సాంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మ చుట్టూ చప్పట్లు చరుస్తూ పాడుతూ చేసిన నృత్యాలు మన సంస్కృతి గొప్పతనాన్ని చాటుతున్నాయి. ఈ బతుకమ్మ వేడుకలు గ్రామంలో అత్యంత వైభవంగా జరిగి, గ్రామ ప్రజల ఐక్యతను, మహిళల ఉత్సాహాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నాయి.సిరికొండ మండలం సుమారు 30 గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. మహిళలు బొడ్డెమ్మలను పేర్చి ఇంటి ముందు ప్రతిష్టించి, సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద మహిళలు, గ్రామస్థులంతా ఒకచోట చేరి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. డిజే పాటలకు నృత్యాలు చేస్తూ పండుగను ఉత్సాహంగా పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతికిగా ప్రతీక సద్దుల బతుకమ్మ

- **ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి**

ఉద్యమపోరు, ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 : తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుకని ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి అన్నారు ఆదివారం రోజున ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రానికి పరిమితం కాకుండా దేశ విదేశాల్లోనూ గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజలు సంస్కృతిక వైభవాన్ని చాటి చెబుతుందని పేర్కొన్నారు. ప్రకృతిని గౌరవిస్తూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరు పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు చిన్న పెద్ద అందరు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకే తొలి ప్రాధాన్యత

- **ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**
- **యాసంగిలో వరి సాగు చేసి ఇబ్బందులు పడవద్దని రైతులకు హితవు**

ఉద్యమపోరు, నిజామాబాద్ అక్టోబర్ 18 : ఎల్ నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక జలాశయాలలో నీటి నిల్వలు చేరని కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.భీంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పాల్గొన్న సందర్భంగా స్థానిక రైతులను ఉద్దేశించి సుదర్శన్ రెడ్డి పలు సూచనలు చేశారు.వర్షాభావం వల్ల భూగర్భ జలాలు సైతం గణనీయంగా పడిపోతున్నాయని,మునుముందు పంటల సాగుకు సరిపడా విద్యుత్ సరఫరా చేసేందుకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అన్నారు.ఖరీఫ్ సీజన్లో సమృద్ధిగా సాగు జలాలు అందించామని,పూర్తి స్థాయిలో కరెంటు సరఫరా చేసి పంటలను కాపాడుకున్నామని గుర్తు చేశారు.అయితే ప్రస్తుతం ఎల్ నినో వల్ల తీవ్ర విపత్కర పరిస్థితులు నెలకొని ఉన్నందున,అందుబాటులో ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాల కోసమే వినియోగించాల్సిన ఆవశ్యకత నెలకొనిందని తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత యాసంగిలో వరి పంట వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.వరి వేసుకుంటే సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే కూరగాయలు,పప్పు దినుసు పంటల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,భీంగల్ మున్సిపల్ చైర్మన్ నాగమణి,రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి,తహసీల్దార్ కిరణ్, నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు నగేష్ రెడ్డి స్థానిక రైతులు ఉన్నారు.

స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

- **ఎనిమిదో రోజు ధైర్యలక్ష్మీ అలంకరణ.. భక్తిశ్రద్ధలతో నారసింహ ఇష్టి..**

ఉద్యమపోరు, రాజేంద్ర నగర్, అక్టోబర్ 18 : స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక శోభతో ఉత్సవాలు కన్నులపండువగా నిర్వహిస్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజు ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మీగా భక్తులకు అభయమిస్తూ దివ్యదర్శనం ప్రసాదించారు.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ పవిత్రమైన రోజున ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి అత్యంత నిష్ఠతో,శాస్త్రోక్తంగా నారసింహ ఇష్టి కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు.వేద పండితులు,రుత్వికుల మంత్రోచ్చారణలు,వేద నాదాల మధ్య జరిగిన ఈ పూజా కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.అమ్మవారి నామస్మరణతో ముచ్చింతల్ క్షేత్రమంతా మార్మోగింది.వైభవంగా బతుకమ్మ సంబరాలు.. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను కూడా వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఏర్పాటు చేసి,వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు.వివిధ రకాల పుష్పాలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.భక్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయబద్ధంగా బతుకమ్మను కొలుస్తూ ఉత్సవాన్ని ఆనందోత్సాహాలతో నిర్వహించారు.దీంతో స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణం భక్తి,సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనంగా కళకళలాడింది.

గట్టు ఇప్పలపల్లిలో నీటి కష్టాలకు చెక్

- **వార్డుల్లో నూతన మోటార్ల ఏర్పాటు**
- **సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్**

ఉద్యమపోరు, తలకొండపల్లి, అక్టోబర్ 18 : తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.వేసవి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామస్థులు మంచినీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నూతన మోటార్లను అందుబాటులోకి తెచ్చారు. గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ నేతృత్వంలో శనివారం గ్రామంలోని పలు వార్డుల్లో ఈ పనులను ప్రారంభించారు.గ్రామంలోని 12వ వార్డులో నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అధునాతన త్రీ-ఫేస్ మోటార్‌ను బోర్బావిలో దించారు. అదేవిధంగా, 2వ వార్డు ప్రజల తాగునీటి అవసరాల కోసం సింగిల్ ఫేస్ మోటార్‌ను విజయవంతంగా ఏర్పాటు చేశారు.ఈ నూతన మోటార్ల ఏర్పాటుతో ఆయా వార్డుల్లో చాన్నాళ్లుగా ఉన్న తక్కువ ప్రెషర్ సమస్య తొలిగిపోయి, ప్రజలకు నిరంతరాయంగా నీరు అందుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.నీటిని వృథా చేయొద్దు:సర్పంచ్ చంద్రశేఖర్ పిలుపు ఈ సందర్భంగా సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ, "మన గ్రామం చాలా పెద్దది.భవిష్యత్తులో నీటి కొరత రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మంచినీటిని వాడుకోవాలి. 'నీటిని కాపాడండిభవిష్యత్తును నిలబెట్టండి' అనే నినాదంతో అందరూ ముందుకు సాగాలి. నీరు లేకపోతే జీవితం శూన్యం. ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనది కాబట్టి ఎవరూ వృథా చేయవద్దు. ఈ రోజు మనం నీటిని పొదుపు చేస్తేనే భవిష్యత్ తరాలకు ప్రాణం పోసిన వాళ్లం అవుతాం" అని గ్రామస్థులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనిత విజయ్, వార్డు మెంబర్లు దుబ్బ మల్లేష్, శెట్టి రాజశేఖర్, ముకురాల అశోక్ గౌడ్, గాదె రేణు రెడ్డితో పాటు స్థానిక నాయకులు, గ్రామ ప్రముఖులు ముత్యాలు, జగన్, అరుణ్, సందీప్, మధు, నవీన్, రాజు, హరికిషన్, నరేష్, అంజి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పినపాక లో వర్ష బీభత్సం : నేలమట్టమైన వరి పంటలు

- **రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోయిన రైతు కష్టం..**
- **ఆదుకోవాలని ప్రభుత్వం, అధికారులకు విజ్ఞప్తి**

ఉద్యమపోరు, పినపాక, అక్టోబర్ 18 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండల వ్యాప్తంగా శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఈ ఆకస్మిక ఈదురుగాలులు, వర్షం కారణంగా మండలంలోని పలు గ్రామాలు, దిగువ ప్రాంతాల్లో రైతులు ఎంతో ఆశగా పెంచుకున్న వరి పంట తీవ్రంగా నష్టపోయింది. చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో రైతులకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లింది.కళ్లముందే నేలవాలిన 'వరి' పైరు..: శనివారం రాత్రి కురిసిన ఈదురుగాలుల ధాటికి వందలాది ఎకరాల్లో పిలకదశ నుంచి పొట్ట దశకు, అలాగే కోత దశకు వచ్చిన వరి పైర్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. వర్షపు నీరు చేన్లలో చేరడంతో పంట తడిసి ముద్దయి కుళ్ళిపోయే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కన్నీరు మున్నీరవుతున్న అన్నదాతలు:విత్తనాలు వేసిన నాటి నుండి ఎరువులు, పురుగుమందుల వేలాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని, తీరా పంట చేతికి వచ్చే సమయంలో దేవుడు కన్నుకుట్టాడని రైతులు వాపోతున్నారు. ఆకస్మిక వర్షంతో పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరైందని, అసలు పెట్టుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలి:మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పంట పొలాలను అధికారులు తక్షణమే క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, పంట నష్టాన్ని అంచనా వేసి తమకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని రైతాంగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. లేనిపక్షంలో అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆర్థికంగా కోలుకోవడం కష్టమవుతుందని ఆవేదనతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published and Owned by Bandari Srujana, on behalf of Sri Venkateswara Printing Solutions, Editor - Bandari Sumanth, is responsible for news selection under PRB act
prgi.gov.in RNI.TGTEL/26/A7716, # 19-212/3-3A, Narsampet, Warangal, Telangana, India - 506132, Cell : 7569337969 Email:udyamaporu@gmail.com